కంటికి రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

- జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి పరీక్షలకు ప్రాధాన్యత
- జిల్లాలో 40 వేలకు పైగా కంటి పరీక్షల నిర్వహణ
- 3,325 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లకు సిఫార్సు చేసిన వైద్యులు
- 10,744 మందికి అవసరమైన మందులు, కళ్లజోళ్లు అందజేత


బందరు మండలం అరిశేపల్లి సచివాలయంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

కోనేరుసెంటర్: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదల కళ్లల్లో వెలుగులు నింపుతున్నాయి. ఆరోగ్యపరమైన సమస్యలతో సతమతమయ్యే గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బృహత్తర కార్యక్రమం పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల ప్రజలకు ఎంతగానో దోహదపడుతుంది. అనారోగ్యం పాలై వైద్యులకు ఫీజు కూడా చెల్లించుకోలేక రోగాల బారిన పడుతున్న వేలాది కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నేత్ర వైద్య నిపుణులు అందిస్తున్న సేవలు పేద ప్రజల కళ్లల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. కంటి చూపు మసకబారి వైద్యులకు ఫీజులు కూడా చెల్లించుకోలేక కంటిచూపును నిర్లక్ష్యం చేస్తున్న ఎంతో మంది కడు పేద కుటుంబాలు ఇప్పుడు ధైర్యంగా వైద్యులను సంప్రదించి కంటి సమస్యలను చూపించుకుని కళ్లల్లో ఎక్కడలేని ఆనందంతో ఇళ్లకు తిరిగి వెళుతున్నారు.

పేదల కళ్లల్లో ఆనందం

జిల్లాలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల మోముల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 30న నుంచి జిల్లాలో మొదలైన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైద్య సిబ్బంది విశిష్టమైన వైద్య సేవలను అందిస్తున్నారు. అర్బన్ హెల్త్ క్లినిక్ (యూహెచ్‌సీ)లు, గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు(పీహెచ్‌సీ)ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ శిబిరాల్లో అనేక రకాల వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది కంటి పరీక్షల విషయంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. అలాగే జిల్లాల్లో జరుగుతున్న వైద్య శిబిరాలకు ఇతర రోగాలతో బాధపడుతున్న బాధితులతో పాటు కంటి సమస్యలతో వచ్చే వారి సంఖ్య రెట్టింపుగా ఉంటుంది. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో సుమారు 40 వేల మందికి పైగా వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. వీరిలో 3,325 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించిన వైద్యులు బాధితులను శస్త్రచికిత్సల నిమిత్తం పెద్దాస్పత్రులకు సిఫార్సు చేశారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న సుమారు 10,744 మందికి అవసరమైన మందులతో పాటు కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు.

అందరికీ కంటి పరీక్షలు

పేదల కళ్లల్లో వెలుగులు నింపేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. గతంలో ప్రభుత్వం జగనన్న కంటి వెలుగు పేరుతో 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు మాత్రమే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించేది. అయితే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఈ ఏడాది నుంచి వయోవృద్ధులతో పాటు చిన్నారులకు సైతం కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తోంది. దీంతో జిల్లాలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ శిబిరాలకు ఆరోగ్యపరమైన సమస్యలతో పాటు దృష్టికి సంబంధించిన సమస్యలను చూపించుకునేందుకు వయసుతో సంబంధం లేకుండా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు.

పేద ప్రజలకు ఉపయుక్తం

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలోని పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ముఖ్యంగా ఈ శిబిరాల్లో పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి సమస్య తీవ్రతను బట్టి అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. అలాగే కళ్లజోళ్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శిబిరాల్లో ఆపరేషన్‌లు అవసరమని గుర్తించిన వారికి ఏరియాల వారీగా ఉన్న పెద్ద ఆస్పత్రుల్లో ఆపరేషన్‌లు చేయటం ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించటంతో పాటు మందులు, కళ్లజోళ్ల పంపిణీతో పాటు ఆపరేషన్‌లు ప్రారంభించడంతో జిల్లా ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణ పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి ఊహించిన దాని కంటే ఎక్కువగానే స్పందన వస్తుంది. వైద్య శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి, వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎక్కువ మంది కంటి సమస్యలతో వచ్చి చూపించుకుంటున్నారు. వైద్యులు అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించటంతో పాటు క్యాటరాక్ట్ ఆపరేషన్లకు సిఫార్సు చేస్తున్నారు.

– గీతాభాయి, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.20,116లు విరాళం



మోపిదేవి: మోపిదేవిలో వేం చేసి ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి కోసూరువారిపాలేనికి చెందిన కోసూరు సుస్మిత రూ.20,116లు విరాళంగా అందజేశారు. సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు విరాళాన్ని అందించారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రధాని మోదీ ప్రశంసా పత్రాలు



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పరీక్షా పే చర్చ కార్యక్రమంలో తమ విలువైన అభిప్రాయాలు వ్యక్తం చేసిన విద్యార్థులకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసా పత్రాలు అందించారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన 9,10 తరగతులు చదువుతున్న 15 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షా పే చర్చలో పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థుల శక్తి, విశ్వాసం, నైపుణ్యంతో భవిష్యత్తు రూపొందించుకుంటే దేశాభివృద్ధి మరింత అభివృద్ధి చెందుతుందని ప్రధాని అందులో తెలియజేశారు. విద్యార్థులను పాఠశాల విద్యా కుటుంబం, తల్లిదండ్రులు కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

రోడ్లపై పశువుల నివారణ చర్యలు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో రహదారులపై సంచరించే పశువులను నివారించాలని జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాలను మున్సిపల్ అధికారులు సోమవారం నుంచి అమలు చేస్తున్నారు. నగరంలో ప్రధాన రహదారిలో సంచరిస్తున్న ఆవులను పారిశుద్ధ్య కార్మికులు తరలించే పనులు చేపట్టారు. మున్సిపల్ కార్మికులు బృందాలుగా ఏర్పడి రోడ్లపై సంచరిస్తున్న ఆవులను తోలుకు వెళ్లి గో సంఘానికి అప్పగిస్తున్నారు. ఆవుల యజమానులు వాటిని వారి స్థలాల్లోనే కట్టి వేయాలని, రహదారులపై తిరిగితే వాటిని అదుపులోకి తీసుకుంటామన్నారు. ఆవులు, గేదెలను రోడ్లపై వదిలేస్తే వాటిని గోశాలకు తరలించి యజమానులకు అపరాధ రుసుం విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



తోట్లవల్లూరు: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని రొయ్యూరులో జరిగింది. గ్రామంలోని పలు ప్రదేశాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఎస్‌ఐ పి.విశ్వనాథ్ సోమవారం ఉదయం పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను ఆయన తహసీల్దార్ కార్యాలయానికి తరలించి అప్పగించారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లకు జరిమానా విధిస్తామని డీటీ ధనలక్ష్మి తెలిపారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పెనమలూరు: సీబీఎస్ సౌత్ జోన్ చెస్ పోటీల్లో కానూరు విద్యార్థులు సత్తా చాటారు. కానూరు స్కాట్‌స్పెస్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు పెద్దాపురంలో జరిగిన సీబీఎస్ సౌత్ జోన్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో కె.శౌర్య, ఆర్.తేజవజ్రాక్ష, యు.రిత్విక్, యు.దివ్యాంష్ ప్రథమ, తృతీయ స్థానం పొందారన్నారు. ఈ పోటీల్లో 47 జట్లకు గాను 188 మంది విద్యార్థులు పాల్గొనగా కానూరు విద్యార్థులు తమ సత్తాచాటారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, కోచ్‌ను పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, అకడమిక్ హెడ్ రమా, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, ఉపాధ్యాయులు అభినందించారు.

పల్లెతుమ్మలపాలెంలో 518 మందికి వైద్య పరీక్షలు



కోనేరుసెంటర్: మండల పరిధిలోని పల్లెతుమ్మలపాలెంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య సిబ్బంది గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది మందులతో పాటు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 518 మంది వివిధ రకాల వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఒడుగు కన్యాకుమారి, ఉప సర్పంచ్ నాగార్జున, పార్టీ ఇన్‌చార్జి కొక్కిలిగడ్డ దుర్గారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఘంటసాల(అవనిగడ్డ): ప్రభుత్వం అందించే పలు శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఎస్సీ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత కోరారు. ఘంటసాల ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకే ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు మూడు రోజుల పాటు నిర్వహించిన చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తి తయారీపై శిక్షణా కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. శిక్షణ పొందిన మహిళలు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త కృష్ణవేణి మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దాలిపర్రు సర్పంచ్ డోకిపర్తి శాంత కుమారి, కేవీకే శాస్త్రవేత్తలు వి.మంజువాణి, జె.యశ్వంత్‌కుమార్, డాక్టర్ రేవతి, డాక్టర్ నవీన్, పలు గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక అగ్రహారంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల పేదలకు నాలుగున్నరేళ్ల పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును, సంక్షేమాన్ని మరోసారి ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ(నాని), సీనియర్ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, మోపిదేవి ద్వారకానాథ్, సర్పంచ్‌లు డొక్కు నాగేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, కొల్లూరి కోటేశ్వరరావు, గొరిపర్తి సురేష్ బాబు, ఎంపీటీసీలు నూకల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు ఫణి, పేరం నాగిరెడ్డి, ఏపీ ఆగ్రో డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి, నాయకులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

కోడూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నవంబర్ 2వ తేదీన అవనిగడ్డలో నిర్వహించే సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తూ, సామాజిక న్యాయం కల్పించారన్నారు. యాత్రకు పార్టీలకతీతంగా ప్రతి ఒకరూ తరలిరావాలని ప్రజాప్రతినిధులు కోరారు.

ఈ - క్రాప్, ఈకేవైసీలకు 733 అభ్యంతరాలు


పెడన మండలం కొంకేపూడిలో ముసాయిదా జాబితా ప్రదర్శన

పెడన: పెడన నియోజకవర్గంలో ఈ - క్రాప్, ఈకేవైసీల ప్రక్రియ పూర్తికావడంతో తుదిగా రైతులకు మరో అవకాశం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో ముసాయిదా జాబితాలను ప్రదర్శించి ఆ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు, పొరబాట్లు ఉంటే వాటిని లిఖితపూర్వకంగా తెలియజేయాలని రైతులకు సూచించారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు అవకాశం కల్పించారు. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 67 రైతు భరోసా కేంద్రాలలో కేవలం కృత్తివెన్ను మినహా మిగిలిన మూడు మండలాల్లో రైతులు అభ్యంతరాలను తెలియజేశారు. పెడన మండలంలో 558 మంది రైతులు లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేయగా గూడూరులో 117 మంది, బంటుమిల్లిలో 58 మంది రైతులు అభ్యంతరాలను తెలిపారు. వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్న వ్యవసాయశాఖాధికారులతో పాటు రెవెన్యూ అధికారులు కూడా వాటిని పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు పెడన మండలంలో 558కి గాను 435 అభ్యంతరాలను పరిష్కరించారు. గూడూరులో 117కు 72, బంటుమిల్లిలో 58కి 48 పరిష్కరించారు. మిగిలిన వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని వ్యవసాయశాఖాధికారులు తెలిపారు.

త్వరలో తుది జాబితాలు..



ఈ - క్రాప్, ఈకేవైసీలకు సంబంధించి తుది జాబితాలను సిద్ధం చేయడానికి గ్రామసభలను నిర్వహించాం. ఆర్బీకేల్లో ముసాయిదా జాబితాలను ప్రదర్శించి వాటిల్లో ఏమైనా తప్పులు, అభ్యంతరాలుంటే తీసుకున్నాం. వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించాం. ఇప్పటికే 95 శాతం పూర్తి చేశాం. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించిన పిమ్మట నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. అక్కడ తుదిజాబితాలను వెల్లడిస్తారు.

-జీవీ శ్రీనివాసరావు, ఏవో, పెడన మండలం

వాటర్ ట్యాంక్ సామర్థ్యం పరిశీలన

గుడివాడ టౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ సామర్థ్యాలు బాగున్నాయని పట్టణ డ్రింకింగ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు కె.ఆంజనేయ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన సంపుల లీకులు, ఇతర అంశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఈ వాటర్ ట్యాంక్ ప్రజలకు అంకితం చేయనున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో వీటి పనితీరును పరిశీలిస్తున్నామన్నారు. నీటిని బయటకు వదిలే సమయంలో ఏమాత్రం లీకులు ఉన్నా దాని వలన నష్టం జరుగుతుందని తక్కువ సామర్థ్యంలోనే వాటిని గమనించడం వలన వెంటనే పరిష్కరించవచ్చని ఆయన తెలిపారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మురళీధర్

అవనిగడ్డ: విద్యార్థులు చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ మురళీధర్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జీవితం నాశనమవుతుందని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గ్రహించాలని, తప్పుడు మార్గంలో వెళ్తుంటే గారాం పెట్టక మందలించాలన్నారు. ఎన్నో ఇబ్బందులు పడి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్‌ఐ రమేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


క్రీడాకారులతో పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, నందం రవి, ఉపాధ్యాయులు

గూడూరు: గూడూరు మండలం రాయవరం, కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటారు. ఈనెల 28న మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు కొత్త పావని, నారగం కీర్తన, విట్టంశెట్టి స్వర్ణలు అండర్-14 బాలికల విభాగంలో, నందం ఫణీంద్ర బాలుర విభాగంలో ఎంపికయ్యారు. పామర్తి దుష్యంత్‌కుమార్ అండర్-17 విభాగం బాలుర, విట్టంశెట్టి అనుశ్రీ బాలికల విభాగంలో ఎంపికయ్యారు. అదే విధంగా కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పి.పవన్ నాగ శ్రీసాయి, ఎం.సోనాష్‌లు బాలుర అండర్-14 విభాగంలో, కె.దేవి ప్రియ, కె.చంద్రపావనిలు బాలికల అండర్-17 విభాగంలో ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయులు, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, నందం రవి అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



జమీగొల్వేపల్లి(పామర్రు): గుడివాడలోని పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో సెలక్షన్స్‌లో జమీగొల్వేపల్లి హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం టి.ఉషారాణి మాట్లాడుతూ కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలుర విభాగంలో ఎం.హర్షవర్ధన్, ఎస్.చందు, బాలికల విభాగంలో డి.ఏసు ప్రియ ఎంపిక అయ్యారన్నారు. అండర్-14 బాలుర విభాగంలో ఎం.ప్రకాష్, బాలికల విభాగంలో కె.ఊర్వ, కె. వెంకట ధనలక్ష్మి ఎంపిక అయ్యారన్నారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.రవి బాబును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

అందుబాటులో ఓటర్ల జాబితా


తహసీల్దార్ కె.ఆంజనేయులు

గుడివాడరూరల్: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉన్నాయని మార్పులు, ఎన్నికల సంఘ నిబంధనల ప్రకారం అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీ లోపు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ కె.ఆంజనేయులు తెలిపారు. గుడివాడ అసెంబ్లీ నియోజక వర్గంలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా వివరాలను తహసీల్దార్ కె.ఆంజనేయులు సోమవారం వెల్లడించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ పరిధిలోని 230 పోలింగ్ కేంద్రాల్లో లక్షా 96 వేల 843 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 94 వేల 664 మంది పురుషులు, లక్షా 2163 మంది మహిళా ఓటర్లు ఉండగా 16 మంది ఇతరులు ఉన్నారని చెప్పారు. 2024 జనవరి 1వ తేదీ లోపు 18 ఏళ్లు నిండిన వారు డిసెంబర్ 9వ తేదీ లోపు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2024 జనవరి 5వ తేదీన తుది జాబితా సిద్ధమవుతుందని స్పష్టం చేశారు. సందేహాలపై సమీపంలోని ఎన్నికల అధికారులు, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు.

ప్రకృతి వైపరీత్యాలతో అప్రమత్తం

ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మిదిలీష్ యాదవ్


పెనమలూరు పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పెనమలూరు: ప్రకృతి వైపరీత్యాల కారణంగా తలెత్తే ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ప్రమాదం నుంచి బయటపడాలని ఎన్డీఆర్‌ఎఫ్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మిదిలీష్ యాదవ్ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల నుంచి బయటపడటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో గ్యాస్ సిలెండర్ ప్రమాదాల విషయంలో కూడా జాగ్రత్త వహిస్తే ప్రమాదాలు నివారించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నుంచి బయటపడే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆర్.మద్దిలేటి, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు ఉత్పత్తి చేయాలి



ఉయ్యూరు: అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలను ఉత్పత్తి చేయాలని వక్తలు సూచించారు. పట్టణంలోని కేసీపీ ఆడిటోరియంలో అడుసుమిల్లి గోపాలకృష్ణ జ్ఞాపకార్థం చెరకు రైతుల ఎండోమెంట్ లెక్చర్ సోమవారం నిర్వహించారు. కేసీపీ యూనిట్ హెడ్ వై.సీతారామదాసు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ చెరకు పరిశోధనా స్థానం డైరెక్టర్ డాక్టర్ ఆర్.విశ్వనాథన్, సుగర్, అండ్ కేన్ కమిషనర్ డాక్టర్ వి.వెంకట్రావు, ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆదిలక్ష్మి, పలువురు శాస్త్రవేత్తల బృందం పాల్గొన్నారు. డెప్యూటీ కమిషనర్ జి.ముత్యాలు, జీఎం కేన్ వీవీ పున్నారావు, డీజీఎం ఆర్.సూర్య, రైతు నాయకులు పాల్గొన్నారు.

నందమూరులో పౌర హక్కుల దినోత్సవం

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ తమకు ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. నందమూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ డి.వనజాక్షి మాట్లాడుతూ ప్రజలు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉన్నపుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. గ్రామాల్లో అంటరానితనం వంటి అమానుష చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం కలిగి ఉండాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వం కేటాయించిన పథకాలను తెలుసుకోవాలన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఎస్‌ఐ జి.రాజు, కార్యదర్శి పిచ్చియ్య, వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.24 లక్షలతో తాగునీటి పైపులైన్ల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీటిని పంపిణీ చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పెరికీడు సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్ అన్నారు. బాపులపాడు పెరికీడులో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.24 లక్షల వ్యయంతో చేపట్టిన తాగునీటి సరఫరా పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలోని వసంతవాడ రోడ్డు నుంచి చింతా సీతయ్య కాలేజీ, రామాలయం ఏరియా వరకు పైపులైన్లు వేసి, కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ జాన్ ప్రకాష్ తెలిపారు. పైపులైను ఏర్పాటుకు పూజా కార్యక్రమాలను నిర్వహించి, పొక్లెయిన్ ద్వారా పనులను ప్రారంభించారు.

వైద్య ఖర్చులకు రూ.50 వేలు ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరాణా వ్యాపారి అంత్యం గుప్తా కుమార్తె తనూజ వైద్యఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఆర్థికసాయాన్ని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు అందజేశారు. ఈ మొత్తాన్ని తనూజ బాబాయి అంత్యం రాజాకు కాకాని వెంకటేశ్వరరావు కుమార్తె భాగ్యలక్ష్మి సోమవారం అందించారు.